క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



వెంకటాచలం: కోవూరుకు చెందిన వెంకటస్వాతికి విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. మెరైన్ బయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సీహెచ్ వెంకటరాయులు పర్యవేక్షణలో స్వాతి ష్రిమ్స్ లిటోపెనియస్ వెనామీలో ప్రోబయోటిక్ బాక్టీరియా నిర్ధారణ, గుర్తింపు వాటి ఇమ్యూన్ ప్రతిస్పందనపై పరిశోధన విజయంతంగా పూర్తి చేయడంతో ఇన్‌చార్జి వీసీ డాక్టరేట్ అందజేసి అభినందించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విడవలూరు: ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఊటుకూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఎన్డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు తదితర అత్యవసర సమయాల్లో చేపట్టాల్సిన చర్యలను ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ దరీపా తెలియజేశారు. అత్యవసర సమయాల్లో వినియోగించే టూల్ కిట్‌ను పాఠశాలకు అందజేశారు. ఎంఈఓ నాగపద్మ, సర్పంచ్ వెంకటశేషమ్మ, సుబ్బారావు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రవికుమార్, సందీప్ కుమార్ రెడ్డి, ఎల్వో మల్లికార్జున్ పాల్గొన్నారు.

దోపిడీ కేసులో జైలుశిక్ష

పొదలకూరు: మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి గ్రామ సమీపంలో గేదెలు తోలుకెళ్తున్న మహిళను బెదిరించి బంగారు నగలు దోపిడీ చేసిన కేసులో ఇద్దరికి గూడూరు ప్రిన్సిపల్ సివిల్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించింది. ఎస్సై ఎస్‌కే హనీఫ్ బుధవారం వివరాలు వెల్లడించారు. 2019వ సంవత్సరంలో కడివేటి సునీల్, షేక్ బాబు మోటార్ బైక్‌పై వెళ్లి మహిళను బెదిరించి ఆమె మెడలోని నగలు దోపిడీ చేశారు. ఈ కేసులో వారిపై నేరం రుజువు కావడంతో కోర్టు పైమేరకు శిక్ష విధించింది.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లురెడ్డి

కోవూరు: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. కోవూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పాటూరులోని చెక్కిరాలదిబ్బ గిరిజన కాలనీలో పర్యటించారు.

సర్పంచ్ X సెక్రటరీ

- పరస్పర ఆరోపణలు

విడవలూరు: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు కోరుతుంటే, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు సహకరించడం లేదని స్థానిక సర్పంచ్ విడవలూరు నిర్మలమ్మ ఆరోపించారు. ముదివర్తిలోని పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆమె మాట్లాడారు. గ్రామంలో పంచాయతీ పనులను నిర్వహించి, వాటి బిల్లులు కోసం శ్రీనివాసరావు వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా ప్రయోజనం లేదని చెప్పారు. బిల్లులపై సంతకాలు చేయాలంటే రూ.50 వేలు చెల్లించాలని, లేని పక్షంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి చెప్పి చెక్ పవర్‌ను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

అసత్య ప్రచారాలు తగదు

తనపై అసత్య ప్రచారాలు చేయడం తగదని ముదివర్తి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. తనపై నిర్మలమ్మ అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అక్టోబర్ ఐదు నుంచి తాను విధులు నిర్వర్తిస్తున్నానని.. తాను రాక ముందే గ్రామంలో కొన్ని పనులు చేశామని, బిల్లులు పెట్టాలంటూ తన వద్దకు సర్పంచ్ వచ్చారన్నారు. పంచాయతీ తీర్మానం పెడదామని, అలా కాకపోతే పంచాయతీ నిధులను వినియోగించకూడదనే అంశాన్ని తెలియజేశానని వివరించారు. సమావేశానికి ఎన్నిసార్లు పిలిచినా, ఆమె రాలేదన్నారు. ఉప సర్పంచ్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

కోవూరు: జనరేట్ యువర్ బిజినెస్ ప్రోగ్రామ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్థానిక వైకేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన, ఏడీఏపీసీఈ శ్రీధర్‌రావు, మాస్టర్ ట్రెయినర్ మధుసూదన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం గాలికి..

- సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలపై చిన్నచూపు
- కాస్మొటిక్ చార్జీలు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రస్తుతానికి తల్లిదండ్రులు ఇచ్చే చిన్న మొత్తాలపై ఆధారం

కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలిచ్చి నేడు వాటిని విస్మరించింది. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో అందులో ఉంటున్న విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.



చిన్నచెరుకూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం



వసతి గృహంలో శిక్షణలో ఉన్న విద్యార్థులు

తోటపల్లిగూడూరు: సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. జిల్లాలో ఆరునెలలుగా కాస్మొటిక్ చార్జీలు అందక పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 71 వసతి గృహాలు నడుస్తున్నాయి. అందులో 41 బాలురవి. 30 బాలికలవి. వాటిల్లో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 4,608 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వారికి తల నూనె, సబ్బులు, ఇతర అవసరాల కోసం ప్రభుత్వం ప్రతినెలా కాస్మొటిక్ చార్జీలను అందించాలి. 3 నుంచి 6 తరగతి వరకు చదివే బాలురకు రూ.175, 7 నుంచి 10వ తరగతి చదివే వారికి రూ.200 ఇవ్వాలి. అలాగే బాలికలకు సంబంధించి 3 నుంచి 6 తరగతి వరకు వారికి రూ.130, 7 నుంచి 10వ తరగతి వారికి రూ.200 పంపిణీ చేశారు. కాగా సబ్బులు, నూనెల ధరలు అమాంతం పెరిగిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న మొత్తం అత్యల్పమే. అది చాలదన్నట్లుగా నెలల తరబడి పట్టించుకోవడం లేదు.

ఈ విద్యా సంవత్సరంలో..

2024 – 25 విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా ఒక్క నెలకు కూడా విద్యార్థులకు ఈ కాస్మొటిక్ చార్జీలు అందలేదంటే కూటమి ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల లెక్కల ప్రకారం సుమారు రూ.60 లక్షలు రావాల్సి ఉంది. గతంలో నగదు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ నుంచి నేరుగా ఆయా వసతి గృహ వార్డెన్లకు అందితే వారు విద్యార్థులకు నేరుగా పంపిణీ చేసేవారు. అయితే కొన్నేళ్ల నుంచి ఆ శాఖ విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రస్తుత సర్కారు పట్టించుకోకపోవడంతో చాలామంది పిల్లలు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



తల్లిదండ్రుల వచ్చినప్పుడు ఇతర ఖర్చుల కోసం ఇచ్చే డబ్బుతో సబ్బులు, తల నూనె కొనుక్కోవాల్సి వస్తోంది. దీంతో మిగిలిన ఖర్చులకు ఇబ్బంది ఏర్పడుతోంది. చాలా వరకూ మేం హాస్టల్లో ఇచ్చే కాస్మొటిక్ చార్జీలపైనే ఆధారపడుతున్నాం. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇంత వరకు నగదు అందలేదు.

– గుణశేఖర్, 10వ తరగతి, బాలుర వసతి గృహం, చిన్నచెరుకూరు

వెంటనే అందించాలి



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు కాస్మొటిక్ చార్జీలు అందలేదు. దీంతో సబ్బులకు, నూనెలకు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే మాకు రావాల్సిన నగదు అందించాలి.

– గోళ్ల రితీష్, 7వ తరగతి, బాలుర వసతి గృహం, చిన్నచెరుకూరు

బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తాం

జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో ఇంకా కాస్మొటిక్ చార్జీలను అందించలేదు. ప్రభుత్వం బిల్లులను విడుదల చేయగానే ఆ మొత్తాలను విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం.

– శ్రీనివాసులు, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ, నెల్లూరు

అయ్యప్పస్వాములకు అన్నప్రసాదాలు

పొదలకూరు: పవిత్రమైన కార్తీక మాసంలో అయ్యప్ప స్వాములకు తోడేరు పంచాయతీలో ఉన్న పార్వతమ్మ దేవస్థానం వద్ద మాదినేని రవీంద్ర – సుప్రజ దంపతులు బుధవారం అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. గత పదిహేళ్లుగా వీరు ప్రయాణంలో ఉన్న స్వాములకు అన్న ప్రసాదాలను అందజేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, ఐదో వార్డు కౌన్సిలర్ షాహుల్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

విద్యార్థులకు అభినందన



ఇందుకూరుపేట: విజయవాడలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ – 14 సెపక్‌తక్రా పోటీల్లో కొత్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ క్రమంలో విజేతలుగా నిలిచిన పూనమల్లి స్నేహ, పావనిని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తదితరులు బుధవారం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అరోరా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం



స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలిచి, ఏ సమస్య వచ్చినా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాచర్లవారిపాళెం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు ప్రకాష్‌రెడ్డి తల్లి శేషమ్మ పెద్దకర్మలో బుధవారం కాకాణి పాల్గొన్నారు. ఇటీవల సౌత్‌ఆములూరు నాయకుడు, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడి పెద్దమ్మ మృతిచెందారు. దీంతో ఆయన్ను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో స్థానికులు కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి ఊసే కనిపించడం లేదంటూ కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహిస్తూ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి రోజులు రావాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారం లేదని అధైర్యపడొద్దని, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, నాయుడు సుధాకర్‌రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, కాకు మనోహర్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, శ్రీను, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ఇందుకూరుపేట: బ్యాంకింగ్ సేవలపై మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంక్‌కు విద్యార్థులను తీసుకెళ్లి, అక్కడ లభించే సేవలను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వృత్తి విద్య శిక్షకుడు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు లేకుండానే..

- నామమాత్రంగా 'పొలం పిలుస్తోంది'
- కూలీలతో ఫొటోలకే పరిమితం



పొలం వద్ద అధికారులు తదితరులు

తోటపల్లిగూడూరు: పథకాలను వివరించడంతోపాటు పంటలను పరిశీలించి నిర్వహించి రైతులకు సాగులో సూచనలు ఇచ్చేందుకు పొలం పిలుస్తోంది గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే అధికశాతం సభల్లోనూ, క్షేత్ర సందర్శనలోనూ పట్టుమని పదిమంది కూడా రైతులు ఉండడం లేదు. మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి ఆధ్వర్యంలో బుధవారం వెంకన్నపాళెం పంచాయతీలో పొలం పిలుస్తోందిలో భాగంగా క్షేత్ర సందర్శన జరిగింది. ఇందులో రైతులు పాల్గొన్నట్లు ఉన్నతాధికారులకు ఫొటోలు పంపారు. అయితే అందులో ఉన్న నలుగురు వ్యక్తులు అసలు రైతులే కాదు. ఇద్దరూ బెంగాల్ కూలీలు. మిగిలిన ఇద్దరిలో ఒకరు ట్రాక్టర్ డ్రైవర్, మరొకరు కూలీల మేస్త్రి. ఈ కార్యక్రమాన్ని అధికారులు నామమాత్రంగా నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు



మనుబోలు: జెడ్పీ పాఠశాలలో మానవహారం

పొదలకూరు: బాల్య వివాహాలను నివారించేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు నెల్లూరు, ప్రకాశం జిల్లాల కేర్ క్యాంపైన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వాసవి పేర్కొన్నారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌ఓలు, మెడికల్ అధికారులు పాఠశాలలకు వెళ్లి సదస్సులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్ రిషిత, శ్రీకావ్య, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి పాల్గొన్నారు.

మనుబోలు: బాల్య వివాహాల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సదస్సు నిర్వహించారు. విద్యార్థినులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు.



పొదలకూరు: మాట్లాడుతున్న డాక్టర్ వాసవి

కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారి, ఉపాధ్యాయులు ఉమాదేవి, నాగలక్ష్మి, హసీనా, హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, అంగన్‌వాడీలు సుజన, నిర్మల, శ్రీలక్ష్మి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపర్చుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం: ఎస్‌ఎల్‌ఎఫ్‌లు తమ పనితీరును మెరుగుపర్చుకొని, సంఘాల ప్రొఫైలింగ్‌ను తప్పుల్లేకుండా అప్‌డేట్ చేయాలని మెప్మా ఏపీఎం అంకయ్య పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణ సమాఖ్య సమావేశాన్ని మెప్మా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఇప్పటికే నూరు శాతం పూర్తి చేసిన ఆర్పీలు కామేశ్వరి, పద్మను సత్కరించారు. సీఓ నర్మద, సుజన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంకయ్య

ఆయుర్వేదానికి అధిక ప్రాధాన్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ జగదీశ్వరి తదితరులు



కొడవలూరు: గండవరంలో..

మనుబోలు: ఆయుర్వేద వైద్యానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మడమనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు జగదీశ్వరి అన్నారు. దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్‌లో భాగంగా మండలంలోని మడమనూరులో బుధవారం ర్యాలీ నిర్వహించి ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రజల్లో తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఇందులో వివరాలు పొందిపరిస్తే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?, ఎలాంటి ఆహారం తినాలని సూచిస్తుందన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఆయుర్వేద వైద్యం పొందడం సులభతరమవుతుందన్నారు.

కొడవలూరు: దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ యాప్‌తో ఆరోగ్యాన్ని పరీక్షించుకోవచ్చని గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి గీత పేర్కొన్నారు. యాప్‌పై అవగాహన ర్యాలీని స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి నిర్వహించారు. యాప్‌ను ఎలా వినియోగించాలి.. వాటి ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్య సంరక్షణకు ఆయుర్వేద పద్ధతులను ప్రోత్సహించాలని కోరారు. ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది సుజాత, మాల్యాద్రి, మునుస్వామి పాల్గొన్నారు.

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పొదలకూరు: పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరికరాలు సిద్ధం ఉన్నాయని తెలిపారు. ముందుగా ఐదు పడకలతో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చుట్టుపక్కల 35 మంది డయాలసిస్ చేయించుకునే వారిని గుర్తించామన్నారు. వింజమూరు, ఉదయగిరిలో మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గుండెపోటు వచ్చిన వారికి అత్యవసరంగా ఇచ్చే రూ.50 వేల ఇంజెక్షన్‌ను సీహెచ్‌సీలో అందుబాటులో ఉంచామని, ఇప్పటి వరకు 35 మందిని బతికించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్త్‌కార్డులు

విద్యార్థుల్లో వ్యాధులను గుర్తించేందుకే హెల్త్‌కార్డులను అందజేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్డులను మూడు విభాగాలుగా ఇస్తున్నామని తెలిపారు. పిల్లల్లో ఉన్న వ్యాధులను గుర్తించడంతోపాటు, అంగవైకల్యం ఉంటే పరికరాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కో – లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు రిషిత కిరణ్, శ్రీకావ్య, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, హెచ్‌ఎం సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెల్త్‌కార్డులను అందజేసిన డీఎంహెచ్‌ఓ

నారుమడులపై జాగ్రత్త వహించాలి

విడవలూరు: నారుమడుల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని వరిణి, రామతీర్థంలో గల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తుఫాన్ తీవ్రత తగ్గుముఖం పట్టాక నారుమడులు, వరినాట్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం వరిణిలోని పొలాలను పరిశీలించారు. వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున, ఎంపీటీసీ భక్తవత్సలం, వీఏఏలు పూజిత, మహేష్, రైతు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: వరి సాగు చేపట్టిన రైతులు విత్తనశుద్ధిని తప్పక పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎంపిక చేసుకోవాల్సిన వరి వంగడాలపై అవగాహన కల్పించారు. ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వర్షాల తర్వాతే నాట్లు వేసుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని దామేగుంట, తలమంచి, గుండాలమ్మపాళెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ఖర్చును తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులను పొందవచ్చని వివరించారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏ లిఖిత, ప్రసాద్, విష్ణుప్రియ, జేవీఓ వెంకటేశ్వర్లు, వీపీఏ వెంకయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామ్‌ప్రసాద్, అనూష పాల్గొన్నారు.

కోవూరు: మండలంలోని వేగూరు, ఇనమడుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత, ఏఓ ఇందిరావతి, పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణకుమారి, మత్స్యశాఖ అధికారి కోటేశ్వరమ్మ, సుభాషిణి, వంశీ, శ్వేతలేఖ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తెగుళ్లను నివారించాలి

పొదలకూరు: పప్పు ధాన్యాల సాగులో రైతులు తెగుళ్లను నివారించకుంటే నష్టపోవాల్సి వస్తుందని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఓబయ్య అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం వ్యవసాయాధికారులతో కలిసి పొదలకూరు పరిసర ప్రాంతాల్లో మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మినుము, పెసర పంటల్లో విత్తనశుద్ధి నుంచి కోతల వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెక్క పురుగులను నియంత్రించడంలో లింగాకర్షక బుట్టలు ఉపయోగపడతాయన్నారు. తెల్లదోమ ఉధృతిని తెలుసుకునేందుకు పసుపు రంగు జిగురు అట్టలు, వేపగింజల కషాయం వాడకం గురించి వివరించారు. ఏడీఏ కె.శివనాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం, మారుతున్న నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ అపరాల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు. తెల్లదోమ వైరస్ తెగులును అరికట్టాల్సిందిగా సూచించారు. అనంతరం పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామంలో సమావేశం నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు.



విడవలూరులో..



కోవూరులో..



కొడవలూరు: గుండాలమ్మపాళెంలో..